**డిటెక్టివ్ కథ**

# ఆత్మ చేసిన హత్య

వి.యస్.రావ్

**పాలు పొంగుతున్నాయి... గిన్నె అంచుపైన గాలి బుడగలా, గుండ్రంగా; అందంగా... మధుమోహన్ ఈలవేస్తూ చూస్తున్నాడు. పాల పొంగు మీద నీళ్ళు చల్లే ప్రయత్నం చేయకుండా ఆనందంగా చూస్తున్నాడు. పాలు పొంగాలి! ఇంటికి మంచిది! పాలు పొయ్యిపాలైతే బాధపడకూడదు! పెళ్ళయిన కొత్తల్లోనే చెప్పింది చంద్రకాంత...**

**కాలింగ్‌బెల్ మోత మధుమోహన్ ఈలపాటను అడ్డుకుంది. స్టౌని ఆర్పేసి, హాలు వైపు వేగంగా నడిచాడతను. కాలింగ్‌బెల్ మళ్ళీ మోగేలోగా తలుపు తెరవాలి. చంద్రకాంత గాఢ నిద్రలో వుంది...**

మధుమోహన్ తలుపు తెరిచాడు; ఎవరొచ్చారా అనుకుంటూ...

''నమస్తే!'' గుమ్మంలో నిలుచున్న 'పారాణి' వారపత్రిక సంపాదకుడు చక్రధారి ఉషారుగా అన్నాడు.

''మీరా! రండిరండి!'' చక్రధారినీ, అతని చేతిలోని టేప్ రికార్డర్‌ని చూస్తూ ఆహ్వానించాడు మధుమోహన్.

''మీరొస్తున్నట్లు కాంతకు తెలుసా?'' తలుపు మూసి, చక్రధారికి సోఫా చూపిస్తూ అడిగాడు మధుమోహన్.

''తెలుసుగా! తొమ్మిదింటికే రమ్మన్నారుగా!'' చక్రధారి టేప్ రికార్డర్ని టీపాయ్ మీద పెట్టి అన్నాడు.

''అలాగా...''

'ఆ! వచ్చేది జన్మదిన సంచిక కదా! చంద్రకాంత గారితో ముఖాముఖీ 'వేద్దామనుకున్నాం.. ఆ పని మీదే వచ్చాను...''

''రాత్రి రెండు దాటిందాకా రాస్తూనే వుంది, పాపం! అందుకే నేను యింకా సుప్రభాతం పాడలేదు!'' మధుమోహన్ నవ్వుతూ అన్నాడు.

''ఎలావస్తోంది కొత్త నవల? ఎప్పటికప్పుడు చదువుతున్నారుగా?'' చక్రధారి ఆశగా అడిగాడు.

''చదవకపోతే వదుల్తారా; మీ రచయిత్రి గారు?'' మధుమోహన్ నవ్వాడు.

''నేను అనుకున్నదానికన్నా, మీరు ఆశించిన దానికన్నా అద్భుతంగా వస్తోంది! పాఠకులు ఉక్కిరిబిక్కిరై పోవడం గ్యారెంటీ!''

''ప్రయోగాత్మక రచన కదా! ఈ సీరియల్‌తో మన పత్రిక ఆ 'నెచ్చెలి' సర్క్యులేషన్ని దాటాలి!'' చక్రధారి కంఠంలో పట్టుదల ఖంగుమంది.

ఉండండి... కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం!'' అంటూ మధుమోహన్ వంటగది వేపు పరుగెట్టాడు.

చక్రధారి సోఫాలో వెనక్కి వాలాడు. ఎదురుగా, గోడకి, వెడల్పాటి ఫ్రేమ్‌లో చంద్రకాంత. ఎడమ అరచేతి మీద చెంపను ఆన్చి, ఏకాగ్రతతో రాసుకుపోతోంది! మధుమోహన్ అదృష్టవంతుడు. చక్కని చుక్క అయిన చంద్రకాంత భార్యగా లభించింది. సౌందర్యమూ, ప్రతిభా కలిసికట్టుగా కాపరం చేస్తున్నాయి చంద్రకాంతలో...

''తీసుకోండి!'' ట్రేని టీపాయ్ మీద పెడుతూ అన్నాడు మధుమోహన్.

''థాంక్స్!'' అంటూ కాఫీ కప్పు అందుకున్నాడు చక్రధారి. ఒక్కసారి చప్పరించి లొట్టవేశాడు. ''చాలా బావుంది! కాఫీ మీరింత బాగా తయారు చేస్తారని తెలీదే!''

''కాఫీ మీరు కాయాలి; కథలు నేను రాయాలి!'' అంటుంది చంద్రకాంత ఎప్పుడూ'' మధుమోహన్ నవ్వాడు.

''అన్యోన్య దాంపత్యమన్నమాట! మరిచి పోయినట్టున్నారు... కాఫీ తీసు కోండి!'' చక్రధారి అన్నాడు.

''శ్రీమతి గారిని నిద్రలేపి, బెడ్‌కాఫీ అందించి – ఆమెతో కలిసి సేవిస్తాను!'' అంటూ ట్రే అందుకుని పడగ్గది వైపు నడిచాడు మధుమోహన్.

చక్రధారి కాఫీ చప్పరిస్తూ అతన్నే చూస్తూ వుండిపోయాడు. బలమైన పొడగాటి విగ్రహం! మధుమోహన్ అందచందాల్లో భార్యకు సరితూగే భర్త! చక్రధారి సిగరెట్ వెలిగించి, చంద్రకాంత రాస్తున్న కొత్త సీరియల్ గురించి ఆలోచించసాగాడు. ఇతివృత్తం నభూతో నభవిష్యతి! దాని ప్రచురణతో 'పారాణి' వారపత్రికల్లో 'రారాణి' కావడం ఖాయం! సీరియల్‌కి చక్కటి ఆకర్షణీయమైన పేరు...

''కాంతీ!''

బిగ్గరగా, భయానకంగా ధ్వనించిన మధుమోహన్ కేక చక్రధారి ఆలోచనల్ని తెంచేసింది. ఉలిక్కిపడి, తటాలున పైకి లేచాడతను. ఏం జరిగింది? ఎందుకలా అరిచాడతను?

''మిస్టర్ మధుమోహన్!'' అప్రయత్నంగా అరిచాడు చక్రధారి.

చక్రధారి కేకకు సమాధానం యిస్తున్నట్టు భళ్ళున చప్పుడైంది. కప్పులూ, సాసర్లూ ట్రే కిందపడి పగిలిన చప్పుడు! వెంటనే వాటిమీద మనిషి పడినట్టు దబ్బుమన్న శబ్దం!

చక్రధారి మరోసారి ఉలిక్కి పడ్డాడు. అతని వేళ్ళ సందులోంచీ సిగరెట్ జారి పడింది. అతనికాళ్ళు అసంకల్పితంగా కదిలాయి. పడగ్గది వైపు వేగంగా పరుగెట్టాడతను. పడగ్గది తలుపు బార్లా తెరిచి వుంది. చక్రధారి గుమ్మం ముందు ఆగి, మళ్ళీ పిలిచాడు; ''మధుమోహన్‌గారూ!''


మనసును కలతపెట్టే నిశ్శబ్దం అతనికి సమాధానం చెప్తోంది. గుమ్మం ముందు క్షణంసేపు తటాపటాయించిన చక్రధారి, పడగ్గదిలోకి నడిచాడు. వెంటనే రాతి గోడను ఢీకొన్నట్టు ఆగిపోయాడు.

మధుమోహన్ నేలమీద బోర్లా పడున్నాడు. అతని ఛాతీకింద నుంచీ కాఫీ ట్రే కొద్దిగా కనిపిస్తోంది. కప్పుల ముక్కలు చెల్లాచెదురుగా పడున్నాయి. అతని శరీరం కింది నుంచీ కాఫీ సన్నటి కాలువ కట్టింది.

కంగారుగా చూస్తున్న చక్రధారి చూపులు మంచం వైపు తిరిగాయి. మంచం ఖాళీగా వుంది... మంచానికి కొంచెందూరంలో గులాబీరంగు చీర అంచులోంచీ రెండు పాదాలు ఇవతలికి కనిపిస్తున్నాయి; గాలిలో వేళ్ళాడుతూ! చంద్రకాంత పాదాలు! చక్రధారి చూపులు పైకిపాకుతున్నాయి. చంద్రకాంత శరీరం గాలిలో వేళ్ళాడుతోంది! ఆ శరీరాన్ని సీలింగ్ ఫ్యాన్‌కు బంధించిన ఎర్రటి నైలాన్‌తాడు మృత్యువు లాగిన రక్త పాశంలా వుంది... చంద్రకాంత విశాల నేత్రాలు నిర్జీవంగా చూస్తున్నాయి. ఆ కళ్ళలో ఆశ్చర్యం గడ్డకట్టి వుంది. ఎర్రటి పెదవుల సందు లోంచీ ఇవతలకి పొడుచుకువచ్చిన ఆమె నాలుక కలకత్తా కాళిక నాలుకలా ఎర్రగా కనిపిస్తోంది...

చక్రధారి వణుకుతున్న కాళ్ళనీ, చేతుల్ని అదుపులో పెట్టుకోడానికి విఫల యత్నం చేస్తున్నాడు. అత

నికి తటాలున మధుమోహన్ గుర్తొచ్చాడు. ఆరిపోతున్న పెదవుల్ని నాలుక కొసతో తడుపుకొంటూ, మెల్లగా నేలమీద కూచుని, బోర్లాపడున్న మధుమోహన్ని వెల్లకిలా తిప్పాడు. మధుమోహన్ కళ్ళు మూసి వున్నాయి. అతని ఛాతీ కదుల్తోంది... మెల్లగా. చక్రధారి లేచి నిలుచున్నాడు. చంద్రకాంత శవం అతన్ని భయపెడుతూ గదిలోంచీ వెళ్ళి పొమ్మంటోంది; మధుమోహన్ శరీరం వుండమంటోంది.



చక్రధారి జేబులోంచీ మొబైల్ ఫోన్ని ఇవతలకి తీశాడు. వణుకుతున్న చేతిలోంచీ అది జారి నేలమీద పడింది. వొంగి, వణికేచేత్తో సెల్ని తీసుకున్నాడతను. ఎవరికి చేయాలి ఫోన్? మొద్దుబారిపోయిన అతని మెదడు అప్రయత్నంగా ఒక వ్యక్తిని గుర్తు చేసుకుంది. ఔను.. ఆ వ్యక్తికి చెప్తే చాలు... చట్టపరంగా ఏంచేయాలో చేస్తాడు.. చక్రధారి ఆలోచిస్తూ నంబరు నొక్కాడు.

''డిటెక్టివ్ టెంపో!'' అవతలి కంఠం గంభీరంగా అంది.

''టెంపోగారూ... నేను ''పౌరాణి' చక్రధారిని...''

''చక్రం! ఏమిటి కథ!''

''టెంపోగారూ, ఘోరం జరిగిపోయింది...'' వణికే కంఠంతో ప్రారంభించి, తడబడుతూ విషయం వివరించాడు చక్రధారి.

''చక్రం... నువ్వు చెప్తున్నదాన్ని బట్టీ చంద్రకాంతది సహజ మరణం కాదని తెలుస్తోంది! ఇలాంటి వాటి గురించి నువ్వు రిపోర్ట్ చేయాల్సింది నాక్కాదు; పోలీసులకి...''

''టెంపోగారూ... నేను... నేను... నా పరిస్థితి అయోమయంగా వుంది. దయచేసి..'' చక్రధారి అడ్డుతగుల్తూ ఏదో చెప్పబోయాడు.

డిటెక్టివ్ టెంపో కంఠం అతన్ని ఆపింది. ''నువ్వు పోలీసులకి రిపోర్ట్ చేయాలి! నేనిప్పుడు వన్‌టౌన్ పోలీసుస్టేషన్లో వున్నా! ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ నీ అదృష్టం కొద్దీ నా ముందున్నాడు! ఫోను అతనికిస్తున్నా, రిపోర్ట్ చెయ్!''

''హలో ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ హియర్!'' ఇన్‌స్పెక్టర్ కంఠం చక్రధారి చెవిలో ఖంగుమంది.

***

ఆశ్చర్యంగా చూస్తున్న పెద్దపెద్ద కళ్ళు. లోకాన్ని వెక్కిరిస్తున్నట్టు పొడుచు కొచ్చిన నాలుక. డిటెక్టివ్ టెంపో చూపులు చంద్రకాంత ముఖం మీదే నాటుకు పోయి వున్నాయి. అలనాటి మేటి నటి సావిత్రిని గుర్తుకు తెచ్చే అందమైన ముఖం... చర్మం రంగులో కలిసిపోయి మెరుస్తూ కనిపిస్తున్న మంగళసూత్రం గొలుసు. లేత గులాబీరంగు చీరలో వొంపులు తిరిగిన తీగలాంటి శరీరం. చంద్రకాంత పైట భుజంమీద లేదు. కిందికి వేళ్ళాడుతోంది. గులాబీరంగు జాకెట్ అనాచ్ఛాదితంగా, కళ్ళను పొడుస్తున్నట్టు కనిపిస్తోంది. పైభాగాన వున్న హుక్ తెగిపోయిన జాకెట్ లోంచీ నల్లరంగు బ్రాసియర్ లీలగా కనిపిస్తోంది. చంద్రకాంత... చక్కనిచుక్క... అయితే ఆమె శరీరాన్ని ఆవరించిన మృత్యువు చక్కని చుక్కకాదు...

''గురూ...'' ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ కంఠం టెంపోని హెచ్చరించింది.

టెంపో పక్కనే నిలుచున్న పృథీరావ్ వైపు తిరగలేదు. చూపుల్ని చంద్రకాంత ఛాతీభాగం నుంచీ పక్కకి తిప్పలేదు.. కొన్ని క్షణాల పాటు...

''గురూ... ఇదిగో... సూయిసైడ్ నోట్'' అంటూ పృథ్వీరావ్ తన వైపు తిరిగిన టెంపోకి ఒక కాగితం అందించాడు. టెంపో చూపులు గుండ్రటి అక్షరాల వెంట పరుగెట్టాయి.

''మధూ డియర్!

మరణానంతర జీవితం గురించిన పుస్తకాలు చదివాక నేను మారిపోయాను. నాలో చావుభయం చచ్చిపోయింది! మరణానికీ, మళ్ళీ బ్రతకడానికి మధ్య వందలాది మంది అనుభవాలను – ''నియర్ డెత్ ఎక్స్ పీరియన్స్‌స్'ను; మరణానుభూతులను చదివి ఆశ్చర్యంలో, ఆనందంలో మునిగిపోయాను! ఆ 'మరణానుభూతి'ని సొంతం చేసుకోవాలన్న వాంఛ నన్ను ప్రభావితం చేసింది! అందుకే ఆ మరణానుభవాన్ని రుచి చూడటానికి వెళ్తున్నాను! మళ్ళీ వస్తాను! పున

ర్జన్మ వుందిగా! 'ధ్రువో జన్మ మృతస్య చ'

మనసారా మరణాన్ని కౌగిలించుకుంటున్న

నీ

కాంతి''

చంద్రకాంత ఆత్మహత్య పత్రం చదవడం ముగించి, టెంపో తలతిప్పి చూశాడు. టేబుల్‌మీద గోడకి ఆన్చి నిలబెట్టిన ఇంగ్లీషు పుస్తకాలు టెంపో దృష్టిని ఆకర్షించాయి. జస్టిస్ కృష్ణయ్యర్ రచన 'డెత్ అండ్ ఆఫ్టర్', రేమండ్ మూడీ రచనలు – 'లైఫ్ ఆఫ్టర్ లైఫ్', 'రిఫ్లెక్షన్స్ ఆన్ లైఫ్ ఆఫ్టర్ డెత్', 'ద లాస్ట్ లాఫ్'; 'అపుట్కిన్' రచన 'ఫ్రమ్ డెత్ టు లైఫ్', 'బిషప్ పైక్' రచన ద అదర్ సైడ్; 'జార్జ్ ఆండర్ సన్' రచన 'వియ్ డోంట్ డై' – ఇంకో ఎన్నో, చావుకీ, పుట్టుకకీ సంబంధించిన పుస్తకాలు!

చంద్రకాంత రైటింగ్ టేబుల్ మీద కాగితాలు దొంతరగా పెట్టి ఉన్నాయి. గాలికి ఎగరకుండా వాటి మీద ఆర్థర్ ఫోర్డ్ రాసిన పుస్తకం 'ద లైఫ్ బియాండ్ డెత్' పెట్టబడి వుంది. డిటెక్టివ్ టెంపో పెదవుల మీద చిరునవ్వు లీలగా మెరిసింది. 'నియర్ డెత్ ఎక్స్‌పీరియన్స్' – మరణ సామీప్య అనుభూతిని తెలుసుకోడానికి చంద్రకాంతను ప్రభావితం చేశాయా, ఆ పుస్తకాలు?

టెంపో ఆలోచిస్తూ చేతిలోని చంద్రకాంత లేఖను పృథ్వీరావ్‌కి అందించాడు.

''స్వహస్త లిఖితం! రాత ఆమెదే!'' పృథ్వీరావ్ తేలిగ్గా ఊపిరి పీల్చుకుంటూ అన్నాడు.

పోలీసు ఫొటోగ్రాఫరూ, ఫింగర్ ప్రింట్స్ ఎక్స్‌పర్ట్ తమ పనులు చేసుకుపోతున్నారు.

''అన్నీ పూర్తయ్యాక శవాన్ని దించండి!'' సిబ్బందికి చెప్తూ ఇన్‌స్పెక్టర్ టెంపోవైపు తిరిగాడు. ''గురూ... చంద్రకాంత భర్తతో మాట్లాడుదాం!'' అంటూ హాల్లోకి నడుస్తున్న పృథ్వీరావ్‌ని మౌనంగా వెంబడించాడు టెంపో–

మధుమోహన్ సోఫాలో జార్లబడి, శూన్యంలోకి చూస్తున్నాడు. పక్కనే కూచున్న చక్రధారి అతనికి బాటిల్‌తో నీళ్ళు తాగిస్తున్నాడు.



''అయామ్ వెరీసార్ మధుమోహన్‌గారూ...'' ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ నొచ్చుకుంటూ అన్నాడు.

మధుమోహన్ రెండు చేతుల్లో మొహాన్ని దాచుకుని, వెక్కివెక్కి ఏడవ సాగేడు. చక్రధారి వోదార్పుగా అతని భుజం మీద చెయ్యివేశాడు. డిటెక్టివ్ టెంపో మధుమోహన్ని జాలిగా చూస్తూ వుండిపోయాడు.

ఆవేశాన్ని నిగ్రహించుకుంటూ మధుమోహన్ తలపై కెత్తాడు. ఏడ్చి ఏడ్చి ఎర్రబడినకళ్ళు. కన్నీళ్ళతో తడిసిన బుగ్గలు. అతను దయనీయంగా, నిస్పృహయంగా ఇన్‌స్పెక్టర్నీ, టెంపోనీ చూశాడు.

''ఇన్‌స్పెక్టర్ గారూ... నా కాంతిని నేనే చంపేశాను! పరోక్షంగా నేనే చంపేశాను! నన్ను... నన్ను ఉరితీసేయండి! నన్ను ఉరితీసేయండి...''

''మిస్టర్ మధూ! ధైర్యం తెచ్చుకోండి...'' టెంపో వోదార్చాడు.

''కాంతిని నేను చంపలేదు; కానీ చంపాను! 'చావు తర్వాత జీవితం' అనే సబ్జెక్ట్‌కి సంబంధించిన పుస్తకాలిచ్చి, ఆ యితివృత్తంతో నవల రాయమన్నాను! బలవంతం చేశాను... కాంతి ఆ పుస్తకాలు అధ్యయనం చేసింది! నవల రాయడం ప్రారంభించింది...''



# మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

## సాలె గూడు

గదినిండా దుమ్ము పేరుకు పోయింది. వస్తువులన్నీ చిందరవందరగా పడి వున్నాయి. వాల్ పేపర్ అంటించినట్టుగా సాలెగూళ్లు గోడల్ని అలంకరించాయి.

బ్యాక్‌డోర్‌కి ఉన్న సాలె గూటిని నిశితంగా పరిశీలించి ''ఇది ఆర్జియోపైడే జాతి సాలెపురుగు కాబోలు'' అన్నాడు డిటెక్టివ్.

''కావచ్చు. కీటక శాస్త్రంలో మా అంకుల్ చాలా కృషి చేశాడు. ఏ పురుగునూ చంపనివ్వడు. చూడండి, ఇల్లెలాగైందో. కనీసం, సాలె గూళ్లు తీసేసి ఇల్లు శుభ్రం చేసుకోవచ్చుగా'' అన్నాడు యువకుడు.

''ఇదేదో హారర్ సినిమా సెట్టింగ్‌లాగుంది. ఇంతకూ జరిగిందేమిటో చెప్పు'' అన్నాడు డిటెక్టివ్.

''అంకుల్ యూరోప్ పర్యటనలో ఉన్నాడు. ఆయన కోరిక ప్రకారం, నేను వారానికోసారి వచ్చి వుత్తరాలు భద్రంగా ఓ సంచీలో పెట్టి పోతుంటాను. మెయిన్ డోర్ తాళం చెవి నా దగ్గరుంది. ఈ రోజు ఉదయం వచ్చి తలుపు తెరిచినప్పుడు యింట్లో ఏదో చప్పుడు వినిపించింది. అనుమానం వచ్చి బిగ్గరగా అరిచాను. అదిగో, ఓ మనిషి ఆ బ్యాక్ డోర్ గుండా పారిపోయాడు. ఐరన్ సేఫ్ డోర్ తెరచి ఉంది. వెంటనే పోలీసులకు ఫోన్ చేశాను''

''సేఫ్‌లో ఏముంది?''

''తెలియదు. అంకుల్‌కెలాగూ ఈ విషయం చెప్పాలిగా. వుత్తరం రాస్తాను'' అన్నాడా కుర్రాడు.

''ఉత్తరం తీరిగ్గా రాయచ్చులే. కాని కట్టు కథలల్లటానికయ్యిడా తెలివి తేటలుండాలి. ఏమంటావు?'' అన్నాడు డిటెక్టివ్.

కుర్రాడు చెప్పినవన్నీ గాలి కబుర్లని డిటెక్టివ్ ఎలా పసిగట్టాడు?

సమాధానం : బ్యాక్ డోర్ తీసుకుని దొంగ పారిపోతే, దానిమీద సాలెగూడు చెక్కు చెదరకుండా ఎలాగుంది?

''ఔను! 'మరణానుభూతి' ఇతివృత్తం నాక్కూడా నచ్చింది! నేను కూడా చంద్రకాంతగార్ని బలవంతం చేశాను..'' చక్రధారి కల్పించుకుంటూ అన్నాడు.

''కానీ ఏం లాభం చక్రధారి గారూ... అవి చదివి కాంతి తానే ఇన్స్‌పైరై పోయింది! మరణానుభవం కోసం నిలువునా...'' మధుమోహన్ ఏడుపుతో వాక్యాన్ని పూర్తి చేశాడు. నెమ్మదిగా తెప్పరిల్లి రెండు చేతుల్తో చెంపలు తుడుచుకున్నాడు.

''చక్రం, మధుమోహన్ చెంపమీద ఆ వాత లేంటి?'' ఎర్రగా వాతలు తేలిన మధుమోహన్ బుగ్గను చూస్తూ అడిగాడు టెంపో.

''చంద్రకాంత గారి శవాన్ని చూసి ఆయన స్పృహ తప్పి పడిపోయారు. నీళ్ళుచల్లి, నెమ్మదిగా స్పృహ వచ్చేలా చేశాను! కోలుకున్న వెంటనే, దుఃఖాన్నీ, ఆవేశాన్ని ఆపుకోలేక పోయారాయన! 'నేనింక బతకను! చచ్చి పోతాను!' అంటూ రెచ్చిపోయాడు. ఆ హిస్టీరియా నుంచి బైట పడేయడానికి, బలంగా ఒక చెంప దెబ్బ కొట్టాను!'' చక్రధారి వివరించాడు.

'' ఇన్‌స్పెక్టర్!'' గదిలోంచీ వస్తూ పిలిచాడు, డాక్టర్ రుషి

''యస్, డాక్టర్!''

''రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ప్రాణం పోయి వుండాలి! పోస్టుమార్టం చేశాక ఖచ్చితంగా చెప్తాను! వస్తాను!'' అంటూ గుమ్మం వైపు కదిలాడు డాక్టర్ రుషి.

''మిస్టర్ మధూ! రాత్రి ఒంటిగంట ప్రాంతంలో మీరు బెడ్‌రూంలో వుండాలిగా?'' ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించాడు.

''పన్నెండు గంటలకి కాంతికి కాఫీ కలిపి యిచ్చాను. రాయడంలో మునిగిపోయినప్పుడు నన్ను కాఫీ అడగడం ఆమెకు అలవాటే... మరో రెండు మూడు గంటలు రాసుకుంటానంది, కాఫీ తాగుతూ. ఆమెను డిస్టర్బ్ చేయడం ఇష్టం లేక, మేడ గదిలోకెళ్ళి పడుకున్నాను. అది నాకు అలవాటే..'' మధుమోహన్ సన్నటి కంఠంతో అన్నాడు. ''చక్రధారి గారు వచ్చాకే, ఆమెను లేపుదామని బెడ్‌రూమ్‌లో కెళ్ళాను..''

''లైఫ్ ఆఫ్టర్ డెత్ పుస్తకాలు చదివి, నవల రాస్తూ వ్యక్తిగతంగా తాను ప్రభావితమైనట్టు, చావు అనుభూతిని పొందాలనుకున్నట్టూ చంద్రకాంత మీతో ఎప్పుడేనా అన్నారా?'' డిటెక్టివ్ టెంపో అడిగాడు.

''నెవర్! తమాషాకి కూడా నాతో అలా అనలేదు! చక్కటి ఇతివృత్తం సూచించినందుకు రోజూ మెచ్చుకునేది నన్ను..'' తన్నుకొస్తున్న ఏడుపును ఆపే ప్రయత్నం చేస్తూ అరచేత్తో నోటిని కప్పుకున్నాడు మధుమోహన్.

''ఓకే... మధుమోహన్! బాడీని మార్చురీకి తీసికెళ్తాం! మేం చేయాల్సిన వన్నీ చేశాక, శవాన్ని అప్పగిస్తాం... మీరు స్టేషన్‌కి రావాలి. నేను ఫోన్ చేస్తాను. మిమ్మల్ని ఇంటరాగేట్‌చేయాలి! స్టేట్‌మెంట్ రికార్డు చేయాలి...'' ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ అన్నాడు.

గుమ్మం ముందు కలకలం. అందరూ తలలు తిప్పి చూశారు. టీవీల వాళ్ళూ, పత్రికా విలేకర్లు గుంపుగా ఆవేశంగా వస్తున్నారు.

''వేటగాళ్లొచ్చేశారు!'' ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ నిట్టూరుస్తూ అన్నాడు.

''నేనే రమ్మన్నాను...'' చక్రధారి అన్నాడు.

***

ఆంధ్రుల అభిమాన రచయిత్రి చంద్రకాంత దుర్మరణం అందరినీ కలచి వేసింది. ప్రసార సాధనాలు ఆ వార్తకు అత్యధిక ప్రాధాన్యత నిచ్చాయి. చంద్రకాంత ఆత్మహత్య చేసుకున్నట్టు అనుమానిస్తున్నామనీ, త్వరలో ఏం జరిగిందో నిర్ధారణవుతుందనీ విలేకర్లతో అన్నాడు ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదన్నాడు...

చంద్రకాంత తమ పత్రిక కోసం 'ఆత్మయానం' అనే ప్రయోగాత్మక ధారావాహిక రచన సాగిస్తూ, స్వర్గస్థురాలైందనీ, అసంపూర్ణంగా వున్న ఆ నవలని సీరియల్‌గా ప్రచురిస్తామనీ, అలిఖితంగా మిగిలిపోయిన కథా భాగాన్ని ఊహించి పూర్తి చేసే పోటీ నిర్వహిస్తామనీ అన్నాడు 'పారాణి' సంపాదకుడు చక్రధారి.

ఆత్మహత్య చేసుకుని తనను దిక్కులేని వాణ్ణి చేసిందంటూ చంద్రకాంతను గుర్తు చేసుకుంటూ విచారించే మధుమోహన్ మీద పాఠకులూ, స్నేహితులు సానుభూతి వర్షం కురిపించారు.

***

ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ డిటెక్టివ్ టెంపో ముందు కుర్చీలో కూలబడి, తేలిగ్గా నిట్టూర్చాడు.

''హమ్మయ్యా! నెత్తిమీద నుంచీ టన్ను బరువు దించుకున్నట్టుంది!'' పృథ్వీరావ్ టెంపో విసిరిన సిగరెట్‌ని ముట్టిస్తూ.

''టన్నా?! ఏమిటన్నా, అది?'' టెంపో సిగరెట్ దమ్ములాగి పొగ ఊదుతూ అడిగాడు.

''అదే... చంద్రకాంత ఆత్మహత్య కేసు. మొదట్లో కంగారు పడ్డాను కానీ... సింపుల్ కేసాఫ్ సూయిసైడ్ గురూ! కేసు తెరిచాం; మూసేశాం!''

''పోస్టుమార్టం రిపోర్టేమంటోంది, పృథ్వీ?'' టెంపో అడిగాడు.

''కొత్తగా చెప్పేదేముందీ? పీకకు తాడు బిగుసుకుపోవడం వల్ల ప్రాణం పోయింది. రాత్రి ఒంటిగంటన్నరా – రెండూ మధ్య... అన్నాడు డాక్టర్ రిపోర్ట్‌లో!''

''శరీరం మీద గాయాలూ, గీరుకుపోయిన గుర్తులు...'' టెంపో ఏదో అడగ బోయాడు.

''అబ్బే! ఏమీ లేవు! వీపు మధ్యలో అరచెయ్యి వెడల్పున చర్మం కొద్దిగా కమిలిపోయి... రంగు మారడం తప్పా!'' పృథ్వీరావ్ తేలిగ్గా అని పొగ లాగాడు.

టెంపో కుర్చీలోంచీ లేచి పచార్లు ప్రారంభించాడు. ''పృథ్వీరావ్, వీపు మీద అలా ఎందుకైందో కనుక్కున్నావా?''

''పడుకున్నప్పుడు ఏ పుస్తకమో ఒత్తుకుని వుంటుందన్నాడు డాక్టర్. అంతే అయ్యుంటుంది?'' పృథ్వీరావ్ తేలిగ్గానే అన్నాడు.

''పాపం... చంద్రకాంత జీవితం అర్థాంతరంగా ముగిసిపోయింది..'' టెంపో సాలోచనగా అన్నాడు. ''అన్నట్టు మధుమోహన్ ఏమంటాడు!''

''ఏమంటాడు! పాపం... దిక్కులేని వాడిలా దిగాలు పడిపోయున్నాడు.. భార్యపోయిన విచారం నుంచీ ఇప్పుడప్పుడే కోలుకునేలా లేడు. చంద్రకాంత ఆత్మహత్య అతన్ని క్రుంగదీసేసింది! పూర్ ఫెలో!''

టెంపో పచార్లు ఆపి, ఇన్స్‌పెక్టర్ పృథ్వీరావ్ ముఖంలోకి రెప్పవేయకుండా చూశాడు.

''చంద్రకాంతది ఆత్మహత్య కాదు, పృథ్వీరావ్!''

''టెంపో!'' పృథ్వీరావ్ ఆశ్చర్యంగా అరిచాడు.

''యస్! నా అనుమానాలు నాకున్నాయి...''

"అనుమానాలా?" పృథ్వీరావ్ అయోమయంగా అన్నాడు" నేను స్వయంగా మధుమోహన్ని ఇంటరాగేట్ చేశాను; అనుమానాలు నివృత్తి చేసుకున్నాను! పోస్ట్‌మార్టం రిపోర్టు, ఇతర సాక్ష్యాధారాలూ అన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, చంద్రకాంతది ఆత్మహత్యే అనే నిర్ధారణకు వచ్చాను!"

"చంద్రకాంతది ఆత్మహత్య కాదు, అది ఆత్మచేసిన హత్య!" టెంపో గంభీరంగా అన్నాడు.

"టెంపో..!"

"ఆమె రాస్తున్న నవల 'ఆత్మయానం' స్క్రిప్టు ఎక్కడుంది?'

"ఎడిటర్ చక్రధారికి అప్పగించాం... అది నీకెందుకు?"

"అదీ; ఆమెరాసిన ఆత్మహత్యా పత్రం నాకు అర్జెంట్‌గా కావాలి పృథ్వీరావ్!"

ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ అయోమయంగా చూశాడు. "అదికాదు టెంపో.. ఆత్మహత్యే అని తేలిన తర్వాత మళ్ళీ కెలకడం..."

టెంపోచెయ్యి పృథ్వీరావ్ భుజం మీద బరువుగా పడింది. "పృథ్వీరావ్! నీకు చాలాసార్లు చెప్పాను; మళ్ళీ చెప్తున్నాను. అసహజ మరణం సంభవించి, అది నీ దృష్టికి వస్తే – దానిని హత్యగా భావించి పరిశోధించాలి! ఆత్మహత్య అని నిర్ణయించుకుని పరిశోధించ కూడదు!"

"ఆఫ్‌కోర్స్... అయితే చంద్రకాంత విషయంలో..."

"నాకు ఆమె రచనా, లేఖా వెంటనేకావాలి పృథ్వీ!" టెంపో అడ్డొస్తూ అన్నాడు.

పృథ్వీరావ్ నిట్టూర్చి మొబైల్‌ఫోన్ తీశాడు.

***

తన ఎదురుగా కూచున్న చక్రధారిని డిటెక్టివ్ టెంపో సూటిగా చూశాడు. "చక్రం... చంద్రకాంత చేత గొప్పనవల రాయించే ప్రయత్నం చేశావ్! రాసేందుకు ఏకబిగిని చదివాను! రిమార్కబుల్!"

"ఆ నవల మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను, టెంపోగారూ కానీ ఏం లాభం! పురిటిలోనే సంధి కొట్టింది! ఉపోద్ఘాతంలోనే ఉపసంహారం పలికింది!" చక్రం నిరుత్సాహంగా అన్నాడు.

"ఇతివృత్తం సూచించింది చంద్రకాంత భర్త అని విన్నాను... నిజమా!" టెంపో సిగరెట్ వెలిగిస్తూ అడిగాడు...

"నిజమే! చంద్రకాంతగారి టేబుల్ మీదున్న ఇంగ్లీషు పుస్తకాలు చూశారుగా! మధుమోహన్ అవన్నీ చదివాడు. ఆ ప్రభావంతో ఆమెకు సరికొత్త ఇతివృత్తం అందించాడు. సినాప్సిస్ రూపంలో కథ పూర్తిగా చెప్పాడని కూడా నాకు చెప్పిందావిడ?" చక్రధారి అన్నాడు.

"నాకో సంగతి అర్థం కావడం లేదు..." టెంపో ఆగాడు. చక్రధారి ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఆ నవలలో కథా నాయకుడు పేరు మధుచంద్ర; కథానాయిక పేరు కాంతి..అవి..."

"మధుమోహన్, చంద్రకాంతల పేర్లే!" చక్రధారి అడ్డుతగులూ అన్నాడు.'అతనికి తల్లిదండ్రులు పెట్టిన పేరు మధుచంద్ర, ఆమె పేరు కాంతి. ఆ విశిష్టరచనలో తమ పేర్లు శాశ్వతం కావాలనుకున్నారు. చంద్రకాంత చెప్పింది.."

"బాగుంది! చక్కటి ఆలోచన! ఆ సూచన కూడా మధుమోహన్‌దే అయ్యుండాలి!" టెంపో మెప్పుగా అన్నాడు.

"ఔను! మీరు సరిగ్గా ఊహించారు!"

"థాంక్స్ చక్రం... మళ్ళీ కలుద్దాం!" టెంపో పైకి లేస్తూ అన్నాడు.

"నవల రాతప్రతి ఇస్తారా?" చక్రధారి అడిగాడు, లేస్తూ.

"రెండ్రోజుల్లో పంపిస్తాను! మళ్ళీ వోసారి చదవాలనిపిస్తోంది!"

***

తన ముందు కాన్ఫరెన్సు టేబులు చుట్టూ కుర్చీల్లో కూచున్న పోలీసాఫీసర్లనూ, తన దగ్గరగా పక్కపక్కనే కూచున్న ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్‌ను, చక్రధారినీ ఒకసారి చూసి డిటెక్టివ్ టెంపో ప్రారంభించాడు.

"ప్రముఖ రచయిత్రి చంద్రకాంతది ఆత్మహత్యకాదు? హత్య! చాలా కాలంగా వేసిన పథకం ప్రకారం, చాలా చాలా తెలివిగా చేసిన దారుణ హత్య! అందరూ ఆత్మహత్యగా భావించిన అసహజ మరణాన్ని నేను మొట్టమొదటి రోజే హత్యగా అనుమానించాను..."

"మొట్టమొదటి రోజా?" పృథ్వీరావ్ ఆశ్చర్యంగా అన్నాడు. ఎందుకనుమానించావ్ టెంపో?"

"అనుమానించడానికి ఒకటికన్నా ఎక్కువ కారణాలే వున్నాయ్; పృథ్వీ! అన్నీ వరసగా చెప్తాను!" టెంపో నవ్వుతూ అన్నాడు.

"చంద్రకాంతది ఆత్మహత్య కాదు అని నేను అనుకోడానికి కారణం ఆమె ధరించిన చీర. స్పష్టంగా చెప్పాలంటే భుజం మీంచీ కిందికి జారిపోయి, ఆమె వక్షభాగాన్ని అనాచ్ఛాదితంగా వదిలేసిన పైట!"

శ్రోతలు కుతూహలంగా టెంపో వైపు చూశారు.

"చంద్రకాంత ఆత్మహత్య చేసుకుని వుంటే – పైటని మట్టసంగా నడుంలో దోపుకుని వుండేది! ప్రాణంలేని స్థితిలో కూడా తనను అనాచ్ఛాదితంగా చూడటాని ఏ స్త్రీ కూడా సహించదు! అంచేత చంద్రకాంత పైట నా అనుమానానికి మొదటి ఆధారం!"

అందరి తలలూ మెచ్చుకుంటున్నట్టు ఊగాయి.

"రెండవ ఆధారం – పోస్ట్‌మార్టం రిపోర్ట్!" టెంపో చిరునవ్వుతో అన్నాడు. చంద్రకాంత వీపు మధ్యభాగంలో అరచేతి వెడల్పున నల్లబడిన చర్మం. అది హంతకుడి మోకాలి గుర్తు. మెడకు ఉరి బిగిస్తూ, ఆమె కదలడానికి వీల్లేకుండా, మోకాలితో వీపు మీద బలంగా నొక్కిపెట్టాడు హంతకుడు...."

"మిస్టర్ టెంపో... ఇంతకీ హంతకుడు..." ఒక ఆఫీసర్ ప్రశ్న అడిగే ప్రయత్నం చేశాడు.

"మధుమోహన్! చంద్రకాంత భర్త!" టెంపో అన్నాడు. "అనుమానితుడూ అతనే; హంతకుడు అతనే! ఇక మూడో ఆధారం..." అంటూ టేబుల్ మీద వున్న కవర్లోంచీ ఒక కాగితాన్ని తీసాడు టెంపో.

"ఇది చంద్రకాంత రాసిన ఆత్మహత్యాపత్రం! నిజం చెప్పాలంటే, తను రాస్తున్న 'ఆత్మయానం' నవలలో 'కాంతి' పాత్రకోసం స్వహస్తాలతో రాసిన ఉత్తరం! ఇది ఎ-4 సైజు పేపర్. చంద్రకాంత నవల రాస్తున్న పేపరు సైజు అదే!" అంటూ టెంపో 'ఆత్మయానం' రాత ప్రతిని టేబుల్ మీద నుంచీ ఎత్తి చూపించాడు.

"ఈ స్క్రిప్ట్ నాకు చాలా విషయాలు చెప్పింది. చదువుతూ ఇందులో 173 వ పేజీ లేదని గుర్తించాను. "కాంతి ఉత్తరం రాయడానికి సిద్ధపడి, టేబుల్ ముందు కూచుంది" అనే వాక్యంతో 172వ పేజీ అయిపోయింది! లేఖ 173వ పేజీలో రాయబడింది. కథకోసం చేతులారా చంద్రకాంత రాసిన లేఖ వున్న 173వ పేజీని కాజేశాడు మధుమోహన్. కుడి వైపు మూలలో చంద్రకాంత పేజీల నంబర్లు వేసింది, రాత ప్రతిలో! అయితే ఆత్మహత్య లేఖ వున్న కాగితం మీద పేజీ నంబరు లేదు! ఎందుకు? చంద్రకాంత నంబరు వేయలేదా? వేసింది! నంబరుంటే, అది లేఖ కాదని తెలిసిపోతుంది! పేజీ నంబరు వుండకూడదు! అందుకే హంతకుడు ముందు చూపుతో 10 సెంటీమీటర్ల వెడల్పుతో కాగితం పైభాగాన్ని – అంచును చించిపారేశాడు!" ఊపిర్లు బిగబట్టి వింటున్న వాళ్ళందర్నీ టెంపో కలియజూశాడు. పేపర్ల దొంతరమీద ఆత్మహత్య లేఖ వున్న కాగితాన్ని పెట్టి, కొలిచి


ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్. 500 073.
ఫోన్ : 040 - 23747777, 9391999999

FREE online Registration & Free search



www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com



అమీర్‌పేట, కూకట్‌పల్లి, దిల్‌షుఖ్‌నగర్, విజయవాడ, గుంటూరు, తెనాలి, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, ఖమ్మం, ఒంగోలు
నెల్లూరు, తిరుపతి, కర్నూలు, (చెన్నయ్) టి.నగర్, బెంగుళూర్, సేలం, మధురై, వెల్లూరు, తిరుచి, పాండిచ్చేరి, ఈరోడ్, ఏలూరు
చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.

చూపిస్తూ ఇలా అన్నాడు.

"స్క్రిప్టు పేజీలకన్నా ఈ పేజీ పది సెంటీమీటర్లు పొట్టిగా వుంది. పై భాగాన చింపిన ఆనవాలు కూడా వుంది! నవల రాతప్రతి చదవగానే, ఈ దొంగతనాన్ని కనిపెట్టేశాను!

అందరూ చప్పట్లు కొట్టారు.

"టెంపో... ఒక సందేహం..." ఇన్‌స్పెక్టర్ పృథ్వీ రావ్ అన్నాడు.

"సూయిసైడ్ నోట్ నవలలో భాగమైతే, 'లేఖ' వున్న భాగం అయిపోయాక, కింద నవల కంటిన్యూగా వుండాలిగా! లేఖ కింద ఖాళీ ఎందుకుంది? విడిగా లేఖరాసి రెడీగా పెట్టినట్టు లేదూ?"

మైడియర్ పృథ్వీ! చక్కటి, తెలివైన ప్రశ్న అడిగావ్! కంగ్రాట్స్!" టెంపో నవ్వుతూ అన్నాడు. "ఆ లేఖతో నవలలో ఆ చాప్టర్ ముగిసి పోయింది! 174వ పేజీలో 12వ ఛాప్టర్ ప్రారంభమైంది. ఛాప్టరు పూర్తవగానే మిగిలిన పేజీని అలాఖాళీగా వదిలిన అలవాటు చంద్రకాంతది! ఈ రచనే దానికి సాక్ష్యం!"

"మిస్టర్ టెంపో చంద్రకాంత హత్యకు చాలా కాలం క్రిందటే పథక రచన జరిగిందన్నారు.." ఇన్



స్పెక్టర్ భూషణం అన్నాడు.

"ఆ విషయానికే వస్తున్నా; మధుమోహన్ భార్యను అంతం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఆమెది ఆత్మహత్య అని లోకం, చట్టం నమ్మాలి! తాను కొని, చదివిన 'జీవితం – మృత్యువు' 'మృత్యువు – అనంతర జీవితం' - విషయాలు విస్తృతంగా చర్చించబడిన ఆంగ్ల పుస్తకాలలోని విష యాలు అతనికి అక్కరకొచ్చాయి. వైద్యుల నిర్ధారణ ప్రకారం మరణించి, కృత్రిమ శ్వాస లాంటి చివరి ప్రయత్నాలతో పునరుజ్జీవితులైన వ్యక్తులు – క్లినికల్‌డెత్‌కీ – మళ్ళీ బ్రతకడానికి మధ్య వ్యవధిలో పొందే అనుభూతినే 'నియర్ డెత్ ఎక్స్‌పీరియన్స్' అంటారు. నవలలో నాయిక ఆ పుస్తకాలలో ప్రభావితురాలవ్వాలనీ, ఉత్తరం రాసిపెట్టి ఉరి వేసుకు చనిపోవాలనీ, ఒకరోజు తర్వాత బ్రతికేలా కథ నడపాలనీ – ఇతివృత్తం డిక్టేట్ చేశాడు మధుమోహన్ చంద్రకాంతకి. మూడొంతులు భాగాల విభజన కూడా అతనే చెప్పి వుంటాడు.

"సో... మధుమోహన్ తెలివిగా, ముందస్తుగా పథకం వేసి 'ఆత్మ యానం' నవలా, అందులో అంతర్భాగంగా 'ఆత్మహత్య పత్రం' – భార్య చంద్రకాంత చేత రాయించారు! అంటే చంద్రకాంత స్వహస్తలిఖితంగా ఆత్మహత్య లేఖ వుండాలి కనక, ఆమె చేత 'సరికొత్త' నవల రాయించాడు!"

"బాగుంది.." పృథ్వీరావ్ అన్నాడు" అంతవరకు బాగానే వుంది. పేర్లు? నవలలో భార్యాభర్తల పేర్లు.."

"ఔను. మధుమోహన్, చంద్రకాంతల పేర్ల భాగాలే వుపయోగించబడ్డాయి! ఎందుకంటే ఆత్మహత్య నోట్‌లో చంద్రకాంత పేరే వుండాలి. తమ' నిజ నామధేయాలే నవలలో నాయికా నాయకులకు వుంచి, ఆ విధంగా పేర్లను శాశ్వతం చేద్దామని భార్యను వొప్పించారు మధు మోహన్!" అందుకు సాక్షి 'పారాణి' సంపాదకుడు చక్రధారి!" టెంపో వివరించాడు.

"ఇంతకూ మధుమోహన్ భార్యను కడతేర్చడానికి కారణం ఏమిటి?" టెంపో ప్రశ్నిస్తున్నట్టు అన్నాడు. అందరి కళ్ళు మౌనంగా టెంపోనే ప్రశ్నించాయి.

'సంతానానికి నోచుకోని చంద్రకాంత అసమర్థత! ఆమె గర్భాశయం తొలగించబడింది! పెళ్ళాం గర్భాశయాన్ని కోల్పోయింది! ప్రేయసి గర్భాశయంలో తన ప్రతిరూపం పెరుగుతోంది. .. పెళ్ళాం కన్నా ప్రేయసి మిన్న!" టెంపో నవ్వుతూ ఆగాడు.

"ప్రేయసా? మధుమోహన్‌కి... ప్రేయసా?" పృథ్వీరావ్ అరిచాడు.

"యస్! ఆమె పేరు లాలస! లాలస వలలో చిక్కుకున్న మధుమోహన్, ఆమెకు కానుకగా భార్య ప్రాణాలు అర్పించాలనుకున్నాడు.. మీరే చూడండి.." అంటూ టెంపో సన్నగా ఈల వేశాడు.

పాతికేళ్ల యువకుడు పక్క గదిలోంచీ వచ్చాడు. అతని చేతిలో సిడి వుంది. టెంపో అతన్ని చూస్తూ, టీవీవైపు సైగ చేశాడు.

"అతను విక్రమ్. నా శిష్యుడు ఒక టీవీ బృందం సహకారంతో లాలస ఇంట్లో స్టింగ్ ఆపరేషన్ చేయించాను! అందులో విక్రమ్ శ్రమ చాలా వుంది! ఇవాళ సాయంత్రం 'స్టింగ్ ఆపరేషన్' టెలికాస్ట్ అవుతుంది! మీరు ఇప్పుడే చూడండి!" టెంపో కుర్చీలో కూచుని, టీవీవైపు తిరిగాడు.

టీవీ తెరమీద మధుమోహన్ ప్రత్యక్షమయ్యాడు. లాలస వయ్యారంగా వచ్చి, అతని తొడల మీద కూచుంది. అంతసేపూ మధుమోహన్ పథకం గురించి టెంపో వివరించాల్సిన అంశాల్లోని ముఖ్య విషయాలను లాలసకు సగర్వంగా వినిపిస్తున్నాడు 'బొమ్మ'లో మధుమోహన్.. అందరూ మంత్ర ముగ్ధుల్లా చూస్తూ, వింటున్నారు..

టెంపో నిలుచుని, అందర్నీ చిరునవ్వుతో చూశాడు. "ఆత్మయానం నవల ద్వారా 'ఆత్మ'చేత అర్ధాంగిని హత్య చేయించాడు. మధుమోహన్. ఇందాకా వివరించినట్టు ఒకనాడు అగ్ని చుట్టూ తిరుగుతూ తన వస్త్రానికి ముడేసుకున్న 'చంద్ర కాంత కొంగు' –నాకు మధుమోహన్ని పట్టిచ్చింది!"

"మా పత్రిక అభిమాన రచయిత్రి చంద్రకాంత హత్యోదంతాన్ని స్పెషల్ ఆర్టికల్‌గా వేస్తాను! ఆమె ఆత్మహత్యను హత్యగా నిరూపించిన డిటెక్టివ్ టెంపో రావుగారితో ముఖాముఖి కూడా వుంటుంది, అందులో!" ఎడిటర్ చక్రధారి అన్నాడు.

"అందులో–ఇన్‌స్పెక్టర్ పృథ్వీకూడా వుంటారు!" టెంపో నవ్వుతూ అన్నాడు.

కరతాళ ధ్వనులు మారుమోగాయి. ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ లేచి నిలబడి ఆఫీసర్లందర్నీ కలియజూశాడు.

"గురూ! నేను వెళ్తాను! మధుమోహన్ని అరెస్టు చేయాలి!" టెంపోను చూస్తూ ఉద్రేకంగా అన్నాడు ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్.

"మధుమోహన్ తన ఇంట్లో లేడు; ప్రియురాలి ఇంట్లోనూ లేడు. ఇద్దరూ కలిసి ఇంకెక్కడో వున్నారు!" టెంపో చిరునవ్వుతో అన్నాడు.

పృథ్వీరావ్ ఆందోళనగా, నిస్పృహగా, ప్రశ్నార్థకంగా ఒకేసారి మూడు రకాలుగా చూశాడు; టెంపోని.

"వాళ్ళిద్దరూ వున్న చోటకి విక్రమ్ నిన్ను తీసుకెళ్తాడు!" టెంపో అన్నాడు.

పృథ్వీరావ్ తేలిగ్గా నిట్టూర్చాడు.

"నిజాన్ని విన్నందుకూ, చూసినందుకు ధన్యవాదాలు!" టెంపో అందర్నీ కలయజూస్తూ అన్నాడు.

కరతాళ ధ్వనులతో అందరూ టెంపోని అభినందిస్తున్నారు.

★

## సినిమాలే ముఖ్యం

హీరోయిన్‌గా దక్షిణాది చిత్రరంగాన్ని ఓ ఊపు ఊపి, ఆ ఊపులోనే పెళ్లి చేసుకొని భర్తతో సహా విదేశాల ఫ్లైట్ ఎక్కేసిన ఆర్తి, గోడకు కొట్టిన బంతిలా త్వరలోనే తిరిగి స్వదేశానికి తిరిగి వచ్చింది. గతంలో తనకు హీరోల విషయంలో కొన్ని పట్టింపులు ఉన్నా, ఇప్పుడు అంటే సెకండ్ ఇన్నింగ్స్‌లో అలాంటి నిబంధనలు ఏమీ పెట్టుకోలేదని చెబుతోంది. ఆ నేపథ్యంలో పోసాని కృష్ణమురళితోనూ, ధర్మవరపు సుబ్రహ్మణ్యం సరసన నటిస్తోంది. గతంలో సునీల్ పక్కన చేసి చేతులు కాల్చుకున్న వైనం ఆర్తికి గుర్తు లేనట్టుంది అని కొందరు గుసగుసలాడుతున్నా అవేవి పెద్దగా పట్టించుకోను అని స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం నాకు హీరోలు, దర్శక, నిర్మాతల కన్నా సినిమాలే ముఖ్యం అని కుండ బద్దలు కొట్టినట్లు చెబుతోంది. ప్రస్తుతం నేను చేస్తున్న సినిమాలలో ఏ ఒక్కటి సక్సెస్ అయినా నా సత్తా ఏమిటో చూపిస్తాను అంటోంది ఆర్తి. గ్లామర్, సీరియస్ పాత్రలు... ఇలా దేనికైనా రెడీ అంటున్న ఆర్తి కొన్ని రోజులు పోతే వాంప్ పాత్రలకు కూడా తెరతీస్తుందని పరిశ్రమలోని వారు అంటున్నారు.